క్లుప్తంగా

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పులివెందుల టౌన్ : చిరు ధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఫుడ్‌సైన్స్‌అండ్ టెక్నాలజీ కళాశాల ప్రొఫెసర్ ఏడుకొండలు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫుడ్‌అండ్‌సైన్స్ కళాశాల విద్యార్థులు వివిధ రకాల చిరు ధాన్యాలను ఉపయోగించి మల్టీ గ్రెన్స్ మిల్లెట్ మాల్ట్‌ను ఎలా తయారు చేసుకోవాలో విద్యార్థులకు వివరించి వాటి యొక్క ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు తయారీ చేసిన మాల్ట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జయమ్మ, పావన దీప్తి, ఎం.రామిరెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి

పులివెందుల రూరల్ : విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి హరిసేవ నాయక్ తెలిపారు. జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాలలో భాగంగా బుధవారం పులివెందుల పట్టణంలోని విద్యుత్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాలను జులై 2వ తేదీవరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా గౌసియాబీ



జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా ఎస్.గౌసియాబీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వేంపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో గ్రేడు-2 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఈమె మైలవరం మండలంలో కూడా ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పనిచేశారు.

ముందస్తు బక్రీద్ వేడుకలు



చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

కమలాపురం : పట్టణంలోని వేదాస్ యూపీ స్కూల్‌లో ముందస్తు బక్రీద్ వేడుకలను హెచ్‌ఎం వసుంధర ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ సయ్యద్ నాసీర్ హుసేని, మదరసా ఉపాధ్యాయులు ఖాజీ జాహిద్ హుసేన్ తదితరులు పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జమ్మలమడుగు రూరల్ : వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్ పాషా తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలకు వారి ఆరోగ్యంపై వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో జలుబు, జ్వరాలు వచ్చె అవకాశం ఉందన్నారు. వెంటనే ఆరోగ్య పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. అనంతరం జైల్ సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఖైదీల సంక్షేమంలో భాగంగా వ్యాధులపై పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రామచంద్ర, జైల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపులు తనిఖీ

చెన్నూరు : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపులను బుధవారం వ్యవసాయ శాఖ సంచాలకులు మద్రిపాటి నాగరాజు తనిఖీ చేసి తదితర రికార్డులను పరిశీలించారు. ఆయన షాపు యజమానులతో మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

చెన్నూరు : ఇర్కాన్ సర్కిల్ వద్ద ఉన్న పంజాబీ దాబా వద్ద బుధవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల కథనం మేరకు.. మైదుకూరు వీసీ సుబ్బయ్య కాలనీకి చెందిన జగన్నాథం బ్రహ్మయ్య కుమార్తె మైత్రి, ఆమె పెద్దమ్మ పగడాల గంగాదేవి, ఆమె కుమార్తె చంద్రికలు టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో మైదుకూరు నుంచి కడపలోని హాస్టల్‌లో పిల్లల్ని చేర్పించేందుకు వస్తుండగా ఇర్కాన్ సర్కిల్ వద్ద ఉన్న పంజాబీ దాబా దగ్గరకు రాగా టీవీఎస్ ఎక్సెల్‌ను లారీ ఢీ కొనడంతో బ్రహ్మయ్య కుమార్తె మైత్రి లారీ టైర్ల కింద పడి మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయాలైన పగడాల గంగాదేవి, ఆమె కుమార్తె చంద్రికను చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి, మైత్రి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయాలు... సేవా నిలయాలు

ఇంటి వద్దకే అన్ని సేవలు

కమలాపురం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 10-12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఇక ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలోనే మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి.

ప్రజల వద్దకే పాలన:

సచివాలయాల ఏర్పాటుతో ఇంటి వద్దకే పాలన అనే నినాదం నిజమైంది. గత పాలకులు ఎప్పుడో ఒకసారి చుట్టపు చూపుగా వచ్చి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నామని గొప్పలు చెప్పుకునే వారు. కానీ జగనన్న ప్రభుత్వం పక్కాగా ఇంటి వద్దకే పాలన అందిస్తోంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్, రేషన్, ఏ పథకం అయినా సరే నేరుగా ఇంటికే పంపిస్తోంది. ప్రజలు ఈ వ్యవస్థకు జేజేలు పలుకుతున్నారు.

జగనన్న నిర్ణయం సాహసోపేతం:

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే వేల కోట్లతో కూడుకున్న ప్రాజెక్ట్. అయినప్పటికి సీఎం జగనన్న ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం నిర్మించారు. అందులో ఉద్యోగులను నియమించి, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయడం తలకు మించిన భారం. అయినా లెక్క చేయని జగనన్న వాటన్నింటిని చకచక పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందారు. జగనన్న తీసుకున్న నిర్ణయం సాహసోపేతం అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు తమకు అందుతున్న సేవల పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సచివాలయంలో అందుతున్న సేవలు:

సచివాలయంలో ప్రభుత్వానికి సంబంధించిన వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, అందరికి ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇల్లు, భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గతంలో రేషన్ కార్డు, ఇంటి స్థలాలు లాంటి ఏ పథకం కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగేవాళ్లమని, ఇపుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రామంలోనే అన్ని సేవలు పొందుతున్నామని ప్రజలు సచివాలయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కమలాపురం 4వ వార్డు సచివాలయం

కమలాపురం మండలంలో సచివాలయాల సంఖ్య:	16
నాలుగేళ్లలో మండలంలో అన్ని రకాల పథకాల లబ్ధిదారుల సంఖ్య:	57,038
లబ్ధిదారులు అన్ని రకాల పథకాలు పొందిన లబ్ధి:	రూ.149 కోట్లు
వైఎస్సార్ ఆసరా తీసుకున్న లబ్ధిదారుల సంఖ్య:	7408
వైఎస్సార్ ఆసరా ద్వారా పొందిన లబ్ధి:	రూ. 12.68 కోట్లు
మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య:	7926
మండలంలో పింఛనర్లు పొందిన లబ్ధి:	రూ.41.76 కోట్లు



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మద్దూరు రామచంద్రారెడ్డి. విభరాపురం గ్రామం, కమలాపురం మండలం. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అది సరిపోక పోవడంతో కౌలుకు పొలం తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ వచ్చిన దాంట్లోనే బతుకు బండి ఈడ్చుతున్నాడు. ఉన్న ఒక్కగా నొక్క కొడుకును చదివించుకుని జీవనం సాగించాలంటే చాలా ఇబ్బంది పేడవాడు. ఈ తరుణంలో ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందామనుకుంటే టీడీపీ హయాంలో ఒక్క రుపాయి వచ్చిన దాఖలాలు లేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ముందుగా పింఛన్ మంజూరైందని దీంతో కొంత మేరకు ఉపశమనం కలిగిందన్నాడు. తర్వాత రామచంద్రారెడ్డి భార్య గంగమ్మకు వైఎస్సార్ ఆసరా మూడేళ్లుగా రూ.30వేలు వచ్చిందని అలాగే ఈబీసీ నేస్తం రూ.15వేలు చొప్పున రెండేళ్లుగా వస్తోందన్నాడు. తమ జీవనం ఇబ్బంది లేకుండా గడిచిపోతుందని రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశాడు.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఏనుగు చిన్న సుబ్బిరెడ్డి. నల్లింగాయపల్లె గ్రామం, కమలాపురం మండలం. ఇతనికి తన గ్రామంలోనే నాలుగు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేస్తే ప్రతి ఏడు కరువే. దాదాపు రూ.లక్ష ఖర్చు చేసి సాగు చేస్తే పంట చేతికొచ్చేది ఎపుడో. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఏదీ కొనాలన్నా కమలాపురంకు వెళ్లాల్సివచ్చేదన్నాడు. రాను పోను ఖర్చులే రూ.200 అయ్యేవట. వ్యవసాయం చేస్తే అప్పులు తప్పా ఆదాయం లేదని, ఏదైన పని చేసుకుందామని చాలా సార్లు అనుకున్నాడట. అయితే అదృష్టం కొద్దీ జగనన్న సీఎం అయ్యాక విత్తనాలు, ఎరువులు, మందులు అన్ని మా గ్రామంలోనే దొరుకుతున్నాయన్నాడు. దీంతో వ్యయ ప్రయాసాలు తగ్గాయన్నాడు. వ్యవసాయానికి అన్ని విధాలా ప్రభుత్వం సాయం చేయడంతో వ్యవసాయం బాగా చేసుకుంటున్నానన్నాడు. ఖర్చులు పోను ఎంతో కొంత డబ్బు మిగిలేదన్నాడు. గతం కంటే వ్యవసాయం ఇపుడు బాగుందన్నాడు. సచివాలయ సిబ్బందికి, సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అని చిన్న సుబ్బిరెడ్డి తెలిపారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి



ఈద్గా మైదానంలో షామియానాలు సిద్ధం చేస్తున్న దృశ్యం

కమలాపురం : బక్రీద్ పండుగను సంతోషంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక ఈద్గా మైదానంలో ఈదు-ఉల్-జుహ ప్రత్యేక నమాజ్ 09.15 నిమిషాలకు నిర్వహించేందుకు షామియానాలు వేశారు. అలాగే పట్టణంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నమాజ్ సమయం

ఈద్గా: 9:15
మస్జిదె-ఉస్మాన్-7:30
మస్జిదె-అక్సా- 8:30
మస్జిదె-అబూబకర్ సిద్ధిఖ్-8:00
మస్జిదె-ఇబ్రహీం-08:30
మస్జిదె-ఖాదరియ-7:30
మస్జిదె-మహమ్మదీయ-8:00
మస్జిదె మర్కజ్-7:15
మస్జిదె-దర్గా-ఏ-గఫారియా-10:00

ఒక భాగం పేదలకు పంచాలి

ఖుర్బాని చేసే జంతువును మూడు భాగాలు చేసి ఒక భాగం పేదలకు పంచి పెట్టాలి. ఒక మనిషి కనీసం ఒక పూట తినే విధంగా మాంసం పంచాలి. అపుడే పేదలు కూడా సంపన్నతులతో సమానంగా పండుగ జరుపుకుంటారు.

–హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, పీఠాధిపతి, దర్గా-ఏ-గఫారియా, కమలాపురం

ఈద్గా సిద్ధం చేశాం:

ఈద్-ఉల్-జుహా పండుగ జరుపు కోవడానికి ఈద్గా మైదానంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. ఉదయం 9.15 గంటలకు నమాజ్ ప్రారంభం అవుతుంది. ముస్లిం సోదరులు సాంప్రదాయ దుస్తులు ధరించి సమయానికి ఈద్గా చేరుకోవాలి.

–సయ్యద్ నాసీర్ హుసేనీ, ప్రభుత్వ ఖాజీ, కమలాపురం.

అంతర పంటగా కంది పంట వేసుకోవాలి

చెన్నూరు : రైతులు అంతర పంటగా కందిపంటను వరిగట్ల మీద వేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఖరీఫ్-2023 కుగాను రైతులకు ఎల్‌ఆర్‌జీ-52 రకాల కందుల మినీ కిట్స్‌ను ఆమె అందజేసి మాట్లాడారు. ఒక్కొక్క మినీ కిట్‌లో నాలుగు కేజీల విత్తనాలు ఉంటాయని, ఒక్కొక్క రైతుకు ఒక మినీకిట్ 100 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. ఈ రకం కంది 150-160 రోజుల్లో కోతకు వస్తాయని కందిని అంతర పంటగా, సూటి పంటగా వరిగట్ల మీద వేసుకోవచ్చునని ఆమె తెలిపారు. అనంతరం చిన్నమాచుపల్లి, ముండ్లపల్లి రైతులకు మినీ కిట్స్‌ను పంపిణీ చేశారు.ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మండల అగ్రికల్చర్ సలహా మండలి అధ్యక్షుడు ఎరసాని మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

వందశాతం రాయితీతో కందులు పంపిణీ

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు 1 సచివాలయ కేంద్ర పరిధిలోని రైతులకు ప్రభుత్వం 100 శాతం రాయితీతో అందజేసిన కందులను బుధవారం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి బుధవారం పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు గ్రామస్థాయిలోనే అందజేయడం జరుగుతోందన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వీరపునాయునిపల్లె మండలానికి ఎల్‌ఆర్‌జీ 52 రకం 5 క్వింటాళ్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ కౌలు రైతులు రైతు భరోసా సిబ్బంది, రెవెన్యూ అధికారులను సంప్రదించి పంట సాగు హక్కు పత్రాలను పొందాలన్నారు. ఎంపీటీసీ లక్ష్మి రామాంజనమ్మ, సర్పంచు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ నిలయాలు రైతు భరోసా కేంద్రాలు



మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి సాంబశివారెడ్డి

వేముల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు సంక్షేమ నిలయాలుగా మారాయని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పులివెందుల ఏడీఏ అశోక్‌రెడ్డితో కలిసి ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. ఆయా సీజన్లలో రైతులు సాగు చసిన పంటలకు ఈ-క్రాప్ చేయడంతోపాటు వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, మట్టి నమూనాల సేకరణ వంటి కార్యక్రమాలు ఈ కేంద్రం ద్వారానే జరుగుతున్నాయన్నారు. చిరు ధాన్యాల సాగులో రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొర్రలు, కంది విత్తనాలను ఉచితంగానే అందిస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, గంగులయ్య, రైతులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



సచివాలయంను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

జమ్మలమడుగు : మండలంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలు బుధవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గొరిగెనూరు ఎస్సీకాలనీలో నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని ధర్మాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శివరామాంజనేయులు ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అలాగే జమ్మలమడుగు చేనేత సొసైటి అధ్యక్షుడు పలు సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా మునెమ్మ అనే వికలాంగురాలు తనకు ఆపరేషన్ చేయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు గ్రామ ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జి.శ్రీనివాసులు, జడ్పీటీసీ ఆశ్విని, ఎంపీపీ హరిత, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మత్తయ్య, హార్టికల్చర్ చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ధన్నవాడ మహేశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి, హృషికేశవరెడ్డి, పోరెడ్డి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని బయమ్మతోటలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నివేధిత పాఠశాలను పరిశీలించి స్కూలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వార్డుల శుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం నూతన మున్సిపల్ కార్యాలయంలో పూల మొక్కలు నాటేందుకు స్థలాన్ని పరిశీలించి పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కాంతమ్మ, పార్నపల్లె కిశోర్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963 170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మండలానికి రూ.6.64 కోట్ల నిధులు విడుదల

వేంపల్లె : మండలంలోని గిడ్డంగివారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న మినీ రిజర్వాయర్‌కు సంబంధించి రూ.4.80 కోట్లు, అలవలపాడు గ్రామంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు రూ.1.84 కోట్ల నిధులు మంజూరైనట్లు వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించి బుధవారం ప్రభుత్వ వాటర్ రీసోర్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌కేడీ, జీఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు సర్కిల్ కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులు మంజూరుకావడంపట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అరటి, మామిడి తోటలు గాలి వర్షానికి దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పాడా నిధులు రైతుల అకౌంట్లలో పడటంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

మండల అభివృద్ధిపై జేసీ సమీక్ష



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మండల అభివృద్ధి, సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జులై మొదటి వారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో భాగంగా మండల ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని.. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలు, అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం పలు సమస్యలపై ఆయనకు అర్జీల రూంలో విన్నవించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, డీటీ వెంకటరెడ్డి, ఆర్ఐ షేక్షా, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



కమలాపురం : శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్, సీకేదిన్నె జడ్పీటీసీ

కమలాపురం : సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని టి.చదిపిరాళ్లలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనాలను వారు సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ప్రారంభించారు. వారి రాకను పురస్కరించుకుని కాంట్రాక్టర్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు పీవీ కృష్ణారెడ్డి గజమాలతో సత్కరించారు. ముందుగా వారు సచివాలయ భవనంను ప్రారంభించి అనంతరం ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ పని కావాలన్నా ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడేవారన్నారు. ఆ ఇబ్బందులను తన పాదయాత్రలో తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరి తదితరవి ఒకే చోట నిర్మించి అక్కడి నుంచే ప్రజలకు అన్ని సేవలు అందిస్తున్నారన్నారు. డిజిటల్ లైబ్రరి ద్వారా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు సైతం అక్కడే ఉన్న వైఫై ద్వారా వర్క్ ఫ్రమ్ హోం చేసుకోవచ్చన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం ఇలాంటి సౌకర్యాలు లేవన్నారు. ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో రెండేళ్లు కరోనాతో రాష్ట్రం తల్లడిల్లిందని, మిగిలిన రెండేళ్ల ఇంత అభివృద్ధి జరగడం నభూతో నభవిష్యత్ అన్నారు. సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని జగనన్న తీసుకువచ్చారని, రాష్ట్రంలో 10వేలకు పైగా సచివాలయాలు, ఆర్‌బీకేలు నిర్మించి ప్రజలకు అక్కడి నుంచి సేవలు అందించడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, పీఆర్ ఏఈ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పీవీ కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మారుజోళ్ల శ్రీని వాసరెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, గఫార్, ఇర్ఫాన్, రెడ్డి కరీం, దేవదానం, మస్తాన్, నిఖిల్‌రెడ్డి, గండి భాస్కర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని ఎర్రగుడిపాడు సచివాలయ కన్వీనర్ కమాల్‌బాషాను బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు పరామర్శించారు. ఇటీవల కమాల్ బాషాకు కంటికి గాయమై చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే జంభాపురం వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్బారెడ్డి భార్య లక్ష్మీదేవి మృతి చెందారు. ఎమ్మెల్యే ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

చింతకొమ్మదిన్నె : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం 16వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, 16వ డివిజన్ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లిఖార్జునయాదవ్, సుబ్బరాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి, గూడ శేఖర్, కిరణ్, సిద్దయ్య పాల్గొన్నారు.

రహదారి పనులకు భూమిపూజ

వీరపునాయునిపల్లె : మండలంలోని బసిరెడ్డిపల్లె గ్రామం నుంచి వెల్దుర్తి గ్రామం వరకు రూ.2.80 కోట్లతో తారురోడ్డు, సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వేణు తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అంకిరెడ్డిపల్లెకు వెళ్లి వేణు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, వెల్దుర్తి సర్పంచ్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

